క్లుప్తంగా

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని వినతి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్

యాదగిరిగుట్ట: ఆలేరు నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. ఆదివారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన డిప్యూటీ సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

వలిగొండ: గ్రామాభివృద్ధికి సహకరించాలని వలిగొండ మండలంలోని మాందాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి కోరారు. వారిలో సోలిపురం సాగర్ రెడ్డి, దంతూరి ఆంజనేయులు, సోలిపురం వెంకట్ రెడ్డి, పలుసం నవీన్, పలుసం శివ, కుసంగి విజయ్ ఉన్నారు.

కేసుల పరిష్కారం తర్వాతే మెయిన్స్ నిర్వహించాలి

మోత్కూరు: గ్రూపు- 1 నోటిఫికేషన్‌పై కోర్టులో ఉన్న కేసుల పరిష్కారం తర్వాతనే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని మోత్కూరుకు చెందిన ఓయూ జేఏసీ నాయకుడు మర్రి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. జీఓ 29 ప్రకారం ఓపెన్ కోటా పోస్టులకు కేవలం ఓపెన్ కేటగిరి (ఓసీ) అభ్యర్థులనే ఎంపిక చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంజయ్య

వలిగొండ: మండలంలోని గొల్లపెల్లికి చెందిన జోగు అంజయ్య తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదివారం నియామక పత్రం అందజేశారు.

ఆరోపణలు అవాస్తవం

మోత్కూరు: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌పై ఆరోపణలు అవాస్తవమని మోత్కూరు మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బందెల రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత ఎమ్మెల్యేను చూసి ఓర్వలేక కొంత మంది అగ్రకుల నాయకులు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై, ఆయన కుమారుల పైన ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

రామన్నపేట స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి

రామన్నపేట: రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాటిపాముల శేఖర్‌గౌడ్ కోరారు. ఈమేరకు ఆదివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

భువనగిరి: పట్టణంలోని శ్రీవైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదివారం స్థానిక వైఎస్సార్ గార్డెన్‌లో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేశారు. కళాశాల చైర్మన్ పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదిర మల్లేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవ చేయడమే లక్ష్యం

యాదగిరిగుట్ట రూరల్: ఆపదలో ఉన్నవారికి, అనారోగ్యానికి గురైన వారికి సేవ చేయడమే రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన లక్ష్యమని సొసైటీ జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, గ్రామ సొసైటీ కమిటీ బృందం పులెపాక వెంకటేష్, నర్సింహులు, లక్ష్మయ్య, మల్లేష్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా బాషా



మోత్కూరు: సమాచార హక్కు చట్టం ఆక్టివిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి గ్రామానికి చెందిన బీసు బాషా నియామకమయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.



భువనగిరిలోని వస్త్ర దుకాణంలో నెలకొన్న రద్దీ

దసరా సందడి

- కొనుగోలుదారులతో రద్దీగా మారిన భువనగిరి పట్టణంలోని దుకాణాలు



గాజుల దుకాణంలో..

భువనగిరిటౌన్: దసరా నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని దుస్తులు, రెడిమేట్, ఎంపోరియం దుకాణాల్లో రద్దీ నెలకొంది. పండుగకు ఇంకా సమయం ఉన్నా కూడా షాపింగ్ మాల్స్ డిస్కౌంట్‌లు ప్రకటించడంతో కొనుగోళ్లు ముమ్మరంగా చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో యాదగిరిగుట్ట, ఆత్మకూర్, మోత్కూర్, బొమ్మలరామారం, వలిగొండ, తుర్కపల్లి తదితర మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. అదే విధంగా ఎలక్ట్రానిక్స్ వస్తువుల దుకాణాల్లో సైతం రద్దీ పెరిగింది.

ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్టలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట: ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు ఆలేరుకు సాగు నీరు అందించడంతో విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం.. ప్రస్తుతం కొండపోచమ్మ, తపాసుపల్లి, నావాబుపేట, మల్లన్నసాగర్ నుంచి సాగు నీరు తీసుకువచ్చి రైతుల కళ్లలో ఆనందం చూస్తున్నానని తెలిపారు. హర్యానా, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలవనుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఔటర్ రింగ్ రోడ్డును, రాష్ట్ర సంపద, భూములను అమ్ముకున్నారని విమర్శించారు. కాళేశ్వరం పేరుతో దోచుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్లు దోచుకొని, దాచుకొని పాలించారన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన అప్పులను ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, ఆయా మండలాల అధ్యక్షులు, గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే ఆందోళన చేస్తాం



మాట్లాడుతున్న జహంగీర్

చౌటుప్పల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ఆందోళన తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ హెచ్చరించారు. ఆదివారం చౌటుప్పల్ మండలంలోని చిన్నకొండూర్ సీపీఎం గ్రామ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించి అమలు చేయకపోవడం దారుణమన్నారు. రైతాంగానికి రైతు భరోసా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. చౌటుప్పల్ ప్రాంతంలో అనేక పరిశ్రమలు ఉన్నా యువతకు ఉపాధి కల్పించడంలో పరిశ్రమ యాజమాన్యాలు విఫలం చెందాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, బూర్గు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కమిటీ సభ్యులు చింతల సుదర్శన్, జక్కిడి రాంరెడ్డి, కొండె శ్రీశైలం పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా పోరాడాలి

యాదగిరిగుట్ట రూరల్: ప్రజలంతా జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీమగాని రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు మంగ నర్సింహులు, మాటూరి బాలరాజ్, బబ్బూరి పోశెట్టి, స్వామి పాల్గొన్నారు.

రెండు దశాబ్దాలు దాటినా కాల్వ పనులు పూర్తిచేయలే

రామన్నపేట: రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన ధర్మారెడ్డిపల్లి కాల్వ నిర్మాణ పనులు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామ మహాసభలో వారు మాట్లాడారు. కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించడం లేదన్నారు. కాల్వ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలన్నారు. అంబటి సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యుడు అంజయ్య, గ్రామశాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, రమేష్, భాస్కర్, ఉపేందర్, నర్సింహ పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న కొండేటి మురళి

రామన్నపేట: రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఉద్యమ వేదిక జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి డిమాండ్ చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివారం రామన్నపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంటు ఫ్యాక్టరీతో రామన్నపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాలు కాలుష్యంగా మారుతాయన్నారు. ఈ నెల 23న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసరి బుచ్చిరెడ్డి, నోముల శేఖర్, ఒంటెద్దు రమేష్, ఒంటెద్దు మారయ్య, బట్టే చెన్నయ్య, చిందాల వెంకటేశం, నోముల శ్రీను, శ్యామల బుచ్చయ్య, శ్యామల మారయ్య పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గామాత

భువనగిరి: దేవి శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఆదివారం దుర్గామాత అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని దుర్గామాత మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హన్మాన్‌వాడలో శ్రీ దుర్గమాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, నల్లగొండ చౌరస్తా వద్ద శ్రీరాంతడాక్ భక్త భజన మండలి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోర్ర రాకేష్, విజయ్‌కుమార్, సభ్యులు నక్కల జగదీష్ యాదవ్, ఎండీ జాని, వినయ్, నాగరాజు, సాయిప్రసాద్, విక్రమ్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ధనలక్ష్మి అలంకరణ నేపథ్యంలో ఆదివారం అమ్మవారిని రూ.45లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

ఆలేరురూరల్: దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలేరు పట్టణ కేంద్రంలోని దుర్గామాత మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, రఘునాథశర్మ, సన్నీ పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవిగా దుర్గామాత

వలిగొండ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గామాతను మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. వలిగొండలోని శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత మండపం వద్ద మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో సతీష్, మాటూరి శివ, బచ్చు శ్రీనివాస్, సోమ శ్రావణ్, తుమ్మల పవన్, మైసోళ్ల హరీష్, మాటూరి ప్రభాస్ పాల్గొన్నారు.



వలిగొండ: దుర్గామాతకు కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

భూదాన్‌పోచంపల్లి: శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఆదివారం దుర్గాదేవి అమ్మవారు శ్రీలలితా సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దుర్గా కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కండేశ్వరస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సీత సత్యనారాయణ, దుర్గా కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ మురళి, భోగ చంద్రశేఖర్, భోగ స్వామి, సీత వెంకటేశ్, ధనుంజయ్య, మధుసూదన్, నర్సింహ పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ఆదివారం కుంకుమార్చన పూజలు, లలితా పారాయణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మొగుళ్లపల్లి సోమయ్య, మండల అధ్యక్షుడు ఇరుకుల్ల వెంకన్న, కార్యదర్శి సోమ వెంకటేశ్వర్లు, కోశాధికారి బుక్కా విశ్వనాథం, బండారు ప్రసాద్, సోమ లింగయ్య, బుస్సా శ్రీనివాస్, గౌరు శ్రీనివాస్, బుక్కా చంద్రశేఖర్, గుజ్జా ఆంజనేయులు, అనంతుల అశోక్, మాశెట్టి వెంకన్న, అనంతుల వెంకటయ్య, సోమ వెంకన్న, ప్రవీణ్‌కుమార్, రంగ వెంకన్న, రాజకోటి, బుక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీబీనగర్: మండల కేంద్రంతోపాటు, రాయరావుపేట, కొండమడుగు గ్రామాల్లో దుర్గమాత మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ గోళి ప్రణీతాపింగళ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భాగ్యలక్ష్మి, సంతోష, మాజీ ఎంపీటీసీ గోళి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భువనగిరిలోని ఆజాద్‌రోడ్డులో శ్రీరామ భక్త భజన మండలి ఆధ్వర్యంలో సహస్ర నామ స్తోత్ర పారాయణం చేస్తున్న భక్తులు



మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

ఆంథోళ్ మైసమ్మ ఆలయంలో ఎంపీ పూజలు

చౌటుప్పల్ రూరల్: మండలంలోని దండు మల్కాపురం గ్రామ పరిధిలోని ఆంథోళ్ మైసమ్మ దేవాలయంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు, కార్యనిర్వహణాధికారి మోహన్‌బాబు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

స్నేహితురాలి కుటుంబానికి పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

యాదగిరిగుట్ట: స్నేహితురాలి భర్త అకాల మృతిచెందడంతో తనతో చదువుకున్న తోటి స్నేహితులు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన దశరథ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి భార్య అరుణతో కలిసి చదువుకున్న ఆమె స్నేహితులు రూ.67వేల ఆర్థికసాయాన్ని ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో తాళ్ల లక్ష్మారెడ్డి, గడ్డమీది మాధవులు, ధీకొండ వెంకటేష్, కీసరి కిషన్‌గౌడ్, గుండ్లపల్లి నరసింహ, కర్రె మల్లేష్, శిఖ బాలరాజు, సత్యనారాయణ, ఎక్కలదేవి భాస్కర్, బెలిదే ప్రవీణ్, మూడ నర్సింహ, బబ్బూరి పోశెట్టి తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

భువనగిరి రూరల్: మండలంలోని రెడ్డినాయక్‌తండా గ్రామానికి చెందిన దరావత్ నర్సింహ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గ్రామస్తులు, గ్రామ యువకులు రూ.43 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో భుక్య రమేష్ నాయక్, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ నాయక్, మధు నాయక్, దరావత్ వెంకటేశ్, రమేష్ నాయక్, కునుసోతు రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భువనగిరిటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వస్తుపుల అభిలాష్, నాయకులు సూరారం కళ్యాణ్, ధనుష్ రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై అధికారులు స్పందించాలి



మాట్లాడుతున్న దయ్యాల నర్సింహ

భువనగిరి రూరల్: స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ అన్నారు. ఆదివారం ఉడుత విష్ణు అధ్యక్షతన భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హన్మాపురం నుంచి బస్వాపురం వరకు, బస్వాపురం నుంచి గంగసానిపల్లి వరకు బీటీ రోడ్డు వేయాలన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ, ఉడుత విష్ణు, ఉడుత సత్యనారాయణ, ముదిగొండ కృష్ణ, మద్దెపురం బాల్‌నర్సింహ, నరాల చంద్రయ్య, ఉడుత వెంకటేష్, ఉడుత సిద్దులు, మచ్చ జహంగీర్, మచ్చ భాస్కర్, రాసాల దేవేందర్, రాసాల అయిలయ్య, నరాల బాలకృష్ణ, ఉడుత దశరథ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి 2003- 04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి హెచ్‌ఎం లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రస్తుత హెచ్‌ఎం మిర్యాల దామోదర్‌తో పాటు గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు జోగు మత్స్యగిరి, ఎస్. మత్స్యగిరి, సాగర్ మృతి చెందడంతో బాధిత కుటుంబాలకు రూ.10వేలు, ఎస్.అంజమ్మ, ఎన్.మంజుల భర్తలు మృతి చెందడంతో ఆర్థికసాయంగా రూ. 10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాషబోయిన నరేష్, కన్నెబోయిన మత్స్యగిరి, కోట శ్రీను, ఈదులకంటి మహేందర్, కూరేల్ల రవి, ఎండీ అష్రఫ్, ఎండీ ఫర్వీన్‌బేగం, శోభ, సునిత, సువర్ణ, జ్యోతి, మమత పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలం చౌల్లరామారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 2008-09 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా తమకు విద్యనేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రావణ్ కుమార్, నర్సయ్య, రమేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూరెళ్లలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శ్రీచక్ర యంత్ర ప్రతిష్ఠతో ఆధ్యాత్మిక వికాసం

భువనగిరి రూరల్: శ్రీచక్ర ప్రతిష్ఠతో దాతలకు ఆధ్యాత్మిక వికాసం కలుగుతుందని సిద్ధగురు రమణానంద మహర్షి అన్నారు. భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి రమణేశ్వరంలోని శివశక్తి శిరిడి సాయి అనుగ్రహ మహాపీఠంలో శ్రీచక్ర యంత్ర ప్రతిష్ఠాపన కొనసాగుతోంది. ఆదివారం కనకదుర్గ, దుర్గాభగవాన్, సాంబశివ, రాధకృష్ణమయి సన్నిధానాల్లో శ్రీచక్ర ప్రతిష్ఠ నిర్వహించారు.

జిట్టా విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

బీబీనగర్: తెలంగాణ ఉద్యమ నేత దివగంత జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహాన్ని బీబీనగర్ మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ పక్కన ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ఆదివారం జిట్టా అభిమాన సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ.. డిసెంబర్‌లో జిట్టా జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు, కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోళి పింగళ్‌రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, గోళి నరేందర్‌రెడ్డి, జిట్టా అభిమానులు ప్రవీణ్‌రెడ్డి, శంకర్, భాస్కర్, మల్లేష్, జంగయ్య పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

నాలుగేళ్లుగా అసంపూర్తిగానే..



పిలాయిపల్లి, దేశ్‌ముఖి రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి తవ్వి వదిలేయడంతో ఏర్పడిన గుంత

- పూర్తికాని పిలాయిపల్లి- దేశ్‌ముఖి రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పిలాయిపల్లి, దేశ్‌ముఖి వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు పనులు చేపట్టి నాలుగేళ్లు అయినా నేటికీ పూర్తికాలేదు. రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు నిధులు మంజూరు కాగా, సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశాడు. దీంతో రోడ్డు ఒక అడుగు కూడా ముందుకు కదలడం లేదు. ఇటీవల పిలాయిపల్లి శివారులో కల్వర్టు కోసం రోడ్డు తవ్వి వదిలేశారు. అంతేకాక రోడ్డు నిర్మాణంలో భాగంగా మధ్యలో మట్టి కుప్పలు పోసి చదును చేయడం మరిచారు. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రివేళలో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



పిలాయిపల్లి దేశ్‌ముఖి రోడ్డులో పోసిన మట్టికుప్పలు



బురదమయంగా మారిన రోడ్డు

ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించబోం

ఆత్మకూరు(ఎం): బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో మాట్లాడారు. ఆలేరు నియోజక వర్గానికి తపాస్‌పల్లి నుంచి మల్లన్న సాగర్, నవాబ్‌పేట రిజర్వాయర్‌ల ద్వారా నీటిని అందిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నరేందర్ గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దులు, మాజీ సర్పంచ్ నగేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్: పట్టణంలోని అంగడి బజార్‌లో బొల్లారం వెంకటలక్ష్మి ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. ఈమేరకు 16 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. అదేవిధంగా శివరాత్రి అందాలు ఇంట్లో 7.4 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.